## 7.2.10 దళిత కవిత్వం

చాతుర్వర్ణ వ్యవస్థలో చోటులేనివారు సాంఘికంగా వెలివేయబడిన పీడితజాతివారు దళితులు. వీరు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అణచబడిన నిమ్నజాతిగా వ్యవహరింపబడ్డారు. చెంపదెబ్బ తిన్న వాడికి తెలుస్తుంది దెబ్బ ఎంత బలమైనదో నీట మునిగిన వాడికి తెలుస్తుంది నీటిలోతు ఒడ్డునున్న వాడికేమి తెలుస్తుంది! దళితుడై అనుభవించిన కష్టాల అనుభవం దళితుడికే తెలుస్తుంది కాని దళితేతరులకు తెలియదంటారు దళితవాదులు.

సత్యశోధక సమాజాన్ని (1873-74) జ్యోతి బా పూలే స్థాపించి హేతుబద్ధమైన మానవీయ దృష్టితో దళితుల అస్తిత్వానికి సంబంధించిన చర్చను ప్రారంభించి నిమ్నజాతుల ఉద్ధరణకోసం సాంస్కృతిక విద్యా రంగాలను చేపట్టారు. 1910, 1917, 1920, 1923లో జరిగిన సభలు, సమావేశాలు మూలంగా సమాజంలో సంస్కరణలు మొదలయ్యాయి. ఆత్మగౌరవం చైతన్యం, జాతీయ భావచైతన్యం, రాజకీయ చైతన్యం, జాతిఉద్ధరణ ప్రధానాంశాలుగా కొనసాగాయి. 1924లో అంబేద్కర్ హరిజనోద్యమం, అస్పృశ్యతా నివారణోద్యమం, ఆత్మగౌరవ ఉద్యమం దళిత ఉద్యమాన్ని బలపరిచాయి. సాంఘిక సమానత కోసం ఆర్థిక అసమానత, పరాధీనత, విద్యా ఉద్యోగ రంగాల అవకాశాలను అందుకోలేక శ్రమ దోపిడీకి గురికావడం దళిత ఉద్యమానికి దారితీసాయి. 1985లో కారంచేడు సంఘటనతో దళిత తాత్త్విక దృక్పథం బలపడింది.

దళిత కవిత్వంలో దళిత స్త్రీ అమ్మగా, పేదరికంలో దళిత స్త్రీగా, వ్యవసాయ కూలీగా, శ్రమ దోపిడీ, లైంగిక దోపిడీకి గురైన స్త్రీగా తిరుగుబాటు ధోరణిలో దళిత స్త్రీగా చూడవచ్చు. దళిత కవిత్వంలో దళిత స్త్రీల అగచాట్లు విరాట్ స్వరూపంలో కంటి ఎదుట కనిపిస్తుంది. సంస్కరణవాది అయిన గురజాడ 'మంచి అన్నది మాల అయితే' అంటూ దళిత సమానత్వాన్ని ఆకాంక్షించినా దళిత



స్త్రీని కవితా వస్తువుగా తీసుకుని 'అనాథ'కావ్యం రచించిన ఘనత జాషువాదే. బహు సంతాన భారంతో, ఆర్థికపరమైన ఇబ్బందులతో ఆకలి బాధలతో నలిగిన మాలెత కథే అనాథ. దళిత సమస్యలను కవిత్వంలో ప్రతిబింబింప చేసిన గుఱం జాషువను తొలి తెలుగు దళితకవిగా భావించవచ్చు. 'గబ్బిలము', 'అనాథ' వంటి పద్య కావ్యాల ద్వారా ప్రతిఘటన చైతన్యానికి ప్రతీకగా నిలుస్తాడు జాషువ. అట్లాగే దళిత ఉద్యమ రథసారథుల్లో ఒకరైన బొజ్జా తారకం కూడా ఈ రంగంలో కృషిచేస్తున్నారు. ఇంకా వచన కవిత్వంలో దళిత స్పృహను వికసింప చేస్తున్నవారు కత్తి పద్మారావు.

ప్రస్తుతం దళిత సాహిత్య వ్యాప్తికై జీవితాన్ని అంకితం చేసి కృషి చేస్తున్న దళిత వర్గ పోరాట కవి శివసాగర్. ఈ బాటలోనే పాటలల్లి, బలమైన గొంతుతో దళిత గర్జన వినిపిస్తున్న కవి గద్దర్. వీరేగాక సాంబశివరావు, సతీష్‌చందర్, క్రాంతి కిరణ్, వెంకన్న, గూడ అంజయ్య వంటి యువకవులు, దళిత గీతాల రచనలో మాష్టార్జీ దళిత ఉద్యమానికి కొత్త రూపాన్ని తీసుకొస్తున్నారు.

"ఆ దూర దేశానికా పుణ్య భూమికి
యాత్ర సాగించుదాము మిణుగురా"[1] – మిణుగురు, బోయి ద్రౌపది,

మిణుగురు చీకట్లో వెలుతురు చిమ్ముతూ పోతుంది. దళిత జాతి జీవితం యుగయుగాలుగా అంధకారమయం. ఆ సమాజపు కట్టుబాట్ల అంధకారం నుండి విముక్తి కోసం మిణుగురులై ఆ వెలుగు నీడలోనే ఆ దూర దేశాన పుణ్యభూమికి తీసుకు పొమ్మని బోయి ద్రౌపది చీకటినుండి వెలుగు పయనానికి మిణుగురు వెలుగునీడ తోడన్నారు.

---

1. నల్లపొద్దు, సం. గోగు శ్యామల, హైదరాబాదు బుక్ ట్రస్ట్, హైదరాబాదు, 2003, పుట 57.

"రేపటి చైతన్యం కోసం తపిస్తున్న ఉన్మాదిని నేను
విచ్చిన రాక్షస రెక్కలను నరికే పచ్చని కత్తిని నేను".[1]

జ్యోతిర్మయి–రేపటి చైతన్యం

దీప్తి కవితా సంపుటిలోని రేపటి చైతన్యం కవితలో రేపటి చైతన్యం కోసం సమాజంలో తాండవిస్తున్న ఉగ్రరాక్షస స్వరూపాన్ని సమూలంగా నరికే పచ్చని పదునైన కత్తి దళిత ఉద్యమం. దళిత ఉద్యమం చైతన్యాన్ని కలిగించాలనే భావన (1946లో రచించిన కవిత) సుమారు యాభై సంవత్సరాలకు సాధించింది.

ఆధునిక తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం వెన్నంటి వచ్చిన ఉద్యమం దళిత ఉద్యమం. వర్గ పోరాటం ద్వారానే స్త్రీల సమస్యలు కూడా పరిష్కారం అవుతాయనే విప్లవవాదుల మాటల్ని విశ్వసించని స్త్రీలు తమ సమస్యలకు తామే పరిష్కారం కనుక్కోవడానికి చేసిన ప్రయత్నమే స్త్రీవాదం. సంపన్న మధ్య తరగతి ఉద్యోగినుల సమస్యలనే ప్రతిఫలించింది స్త్రీవాదం. కానీ దళిత వర్గాల స్త్రీల సమస్యలను పట్టించుకోలేదనే విమర్శను ఎదుర్కొంది. ఈ క్రమంలో దళిత సాహిత్యంలో దళిత స్త్రీవాదం అనే కొత్తకోణం వెలుగు చూసింది. చల్లపల్లి స్వరూపరాణి, జి. విజయలక్ష్మి, వినోదిని మొదలైన రచయిత్రులు దళిత స్త్రీల సమస్యలను తమదైన దృష్టి కోణం నుంచి ఆవిష్కరించారు.

"అసలు నా జీవితాన్ని
నేనుగా జీవించిందెప్పుడు

1. నల్లపొద్దు, సం. గోగు శ్యామల, హైదరాబాదు బుక్ ట్రస్ట్, హైదరాబాదు, 2003, పుట 146.



ఇంట్లో పురుషాహంకారం
ఒక చెంప ఛెళ్ళు మనిపిస్తే
వీధిలో కులాధిపత్యం
రెండో చెంప పగులగొడుతుంది"[1] – మంకెన పూవు

అని చల్లపల్లి స్వరూపారాణి సామాజిక స్వరూపం పట్ల ఆవేదనను వ్యక్తం చేసారు.

దళిత స్త్రీ శ్రమదోపిడికి అవమానాలకు గురవుతున్న విధానాన్ని జి. విజయలక్ష్మి 'పనిపిల్ల' కవితలో ఆవిష్కరించారు. ఆకలి, దారిద్ర్యం, కుల వివక్ష ఎదుర్కొంటున్న దళిత స్త్రీలు పని మనుషులుగా రూపొందిన విధానాన్ని బొమ్మ కట్టించారు.

మధ్య తరగతికి చెందిన, నగరవాసుల స్వీయానుభవాలతో ప్రారంభమైన స్త్రీవాద కవిత్వం, విమల, పద్మ వంటి వారి కవిత్వంలో శ్రామిక వర్గ స్త్రీల ఆత్మఘోషను కూడ చేర్చుకుంది. ఆ తరువాత స్త్రీలందరి సమస్యలూ ఒకేలా వుండవనీ, దళిత మైనారిటీలకు చెందిన స్త్రీల వెతలు మరింత దారుణంగా ఉంటాయని ఒక కొత్త అవగాహన ఏర్పడింది.

దళిత స్త్రీలు తరతరాలుగా దగాపడ్డారు. భారతదేశంలో సోషలిజం వస్తుందని భవిష్యత్ రాజ్యాధికారం కూడ వారిదేనని తెలుపుతున్నారు. పువ్వులైన దళిత స్త్రీలు పులులై గర్జించి పురుషాహంకార సమాజాన్ని అగ్ర కులాధిపతుల్ని అణువణువున అణగ ద్రొక్కుతామని దళిత మహిళలదే అధికారమని భవిష్యత్తులో సాహిత్యం, సమాజం, రాజకీయం తమదేనంటున్నారు జి. విజయలక్ష్మి.

"ఇవాల్టి సాహిత్యాధికారం

1. పదునెక్కిన పాట, సంపాదకుడు, జి. లక్ష్మీనరసయ్య, దళితసాన ప్రచురణలు, విజయవాడ, 1996, పుట 3.

రేపటి రాజకీయాధికారం

దళితులదే

ఇండియన్ రిపబ్లిక్స్

అధికారం

దళిత మహిళలదేనని

చేస్తున్నాం సవాల్"[1] – సవాల్.

ఒకవైపు కులపరమైన అణచివేతతోపాటు అదనంగా జెండర్ అణచివేతకు వర్గపరమైన దోపిడీకి గురవుతూ దళితుల్లో దళితగా అట్టడుగు స్థాయికి నెట్టబడింది దళిత స్త్రీ.

చిగురుటాకుల వంటి నా వేళ్ళు భాగ్యనగర్ నిర్మాణంలో రాళ్ళయ్యాయి[2]

'జీవితాంతం ఊడిగమైపోయి జీడిగింజల్లా మారిన నీ నల్లవేళ్ల సాక్షిగా'[3]

దళిత స్త్రీ ఇంట్లో పురుషాధికారాన్ని, వీధిలో కులవివక్షను ఏకకాలంలో అనుభవిస్తున్న దయనీయ స్థితిని ఆవిష్కరిస్తుంది. దళిత స్త్రీ శ్రమ దోపిడీకి అవమానాలకు గురవుతున్న విధానాన్ని కవిత్వంలో బొమ్మ కట్టించారు. దళిత స్త్రీ వాదంలో జి. విజయలక్ష్మి, చల్లపల్లి స్వరూపరాణి, దరిశె శశి నిర్మల కులవివక్షకు జెండర్ వివక్ష తోడనే అంశాలపై రచనలు చేసారు. మగవాళ్ళే కాకుండా మహిళల అణచివేతకు దారితీసే సంప్రదాయాల్ని వీరు వ్యతిరేకిస్తున్నారు.

"లక్షలాది వర్తమాన నేత్రాల పక్షాన

నేనొక కొత్త దేశాన్ని స్వప్నిస్తున్నాను."[4] – వర్తమానం

---

1. చిత్తరువు, దళిత కవితా సంకలనం, సం. తాటిపర్తి బాలస్వామి, జి. విజయలక్ష్మి, ఆంధ్ర జెసూట్ సోషల్ యాక్షన్ ప్రచురణలు, 1997, పుట 18.
2. నల్లకలువ, కత్తి పద్మారావు, 1996, పుట 7.
3. నల్లద్రాక్ష పందిరి, సుధాకర్ ఎండ్లూరి, జె.జె. ప్రచురణలు, సికింద్రాబాద్, 2002, పుట 74.
4. వర్తమానం, ఎండ్లూరి సుధాకర్, మానస ప్రచురణలు, రాజమండ్రి, 1992, పుట 83.



వర్తమాన కాలంలో దేశంలో విలయతాండవం చేస్తున్న భీతావహ సన్నివేశాలకు, సంఘటనలకు స్పందించి కల్మష వాతావరణం నుండి దేశం బయటపడాలని కలలు కంటున్నాడు. తాను కలలు కంటున్న దేశంలో ప్రశాంత వాతావరణాన్ని కవిత్వీకరించారు.

"అణచే చేతిని నరికే ఆయుధమే దళిత కవిత" అంటారు పైడి తెరేష్‌బాబు.

మనిషి సాటి మనిషికి చేసిన అన్యాయాన్ని అణచివేతను విమర్శిస్తూ పైడి తెరేష్‌బాబు 'అణచే చేతిని నరికే ఆయుధం'[1] అనే దళిత గజల్‌లో మానవ నడవడిని ఖండించారు. ఊరినుండి తరిమివేసింది మనిషి, శ్రమ దోపిడి చేసింది మనిషి, బతుకు విస్తరిని చించింది మనిషి తన బ్రతుకీవిధంగా ఉండటానికి మూలకారణం మనిషి అని అగ్రవర్ణాలవారు చూపిన విభేదాలను ఖండిస్తూ కర్మ సిద్ధాంతాన్ని మూలకారణం అని అనకుండా మానవుడే మూలకారణమన్న సత్యాన్ని ప్రకటించారు.

"కలలే కదా అందమైన భవితకు పునాదులు

రేయి ఒకటి నలుపు రేయి కలలు నలుపు కాదు"[2] – కన్నొకటే నలుపు

భవిష్యత్తుకు ఆశ పునాది. కవి కోరుకునేది మానవ పరిణామం తద్వారా సామాజిక పరిణామం.

'మనుషులే కుక్కల్ని కరిచే వార్తలు ప్రచురించేందుకు సిద్ధంగా ఉండండి'[3]

గత శిథిల చరిత్ర, అస్పృశ్య చరిత్ర, పోరాట చరిత్ర, గుణపాఠాల చరిత్ర మళ్ళీ మళ్ళీ పునరావృత్తమవుతుంది. ఇంతకు పూర్వం ఉద్యమించిన ఉద్యమాల వలన దళిత సమస్యకు ప్రయోజనం చేకూర్చలేకపోయాయి.

---

1. అల్పపీడనం, పైడి తెరేష్‌బాబు, నవ్య ప్రింటర్స్, రాజ్‌భవన్ రోడ్, హైదరాబాదు, నవంబరు, 1996, పుట 26.
2. అల్పపీడనం, పైడి తెరేష్‌బాబు, 1996, పుట 34.
3. కుక్క కరిచిన వార్త, అల్పపీడనం, పైడి తెరేష్‌బాబు, 1996, పుట 16.

"సమస్యా మనదే – పరిష్కరించుకోవాల్సిందీ మనమే
యుద్ధమూ మనదే – యుద్ధం చేయాల్సిందీ మనమే
కాని ఆచరణేది ? ఆయుధమేది"
అగాదవు ఆఖరి మెట్టు నుండి అంధకారంలోకి తన్నబడుతున్నా
గన్నులై పేలాల్సిన అస్థిత్వపు వెన్నులేవి?"[1]

నేనే అసలైన ధనవంతుణ్ణిఅని ప్రశ్నిస్తున్నాడు అనామధేయుడు.

గత, వర్తమాన, భవిష్యత్కాలాలను విశ్లేషిస్తూ 'మా పునాదుల్ని సైతం పెకలించుకొని మళ్ళీ సరికొత్తగా నిర్మించుకుంటున్నాం' అని వర్తమానంలో చేపట్టిన నిర్మితిని, ఆ పునాదులపై ప్రజాస్వామిక విప్లవం, సాంస్కృతిక విప్లవం రెండు తన ఆయుధానికి రెండంచులు.

"రేపు ఎర్రకోటపై ఎగరబోయే
ఎర్ర జెండాని నేనే"[2]

అనటం వలన భవిష్యత్ రాజ్యాధికారం దళితులదేనని తెలియజేస్తున్నారు.

భూతకాల త్యాగాలను విస్మరించక వర్తమానంలో సాయుధ పోరాట మార్గాన్ని చేపట్టి యుద్ధంలోనే నా ఉనికి గుర్తించిన యుద్ధమై రాటుదేలి భవిష్యత్తులో ఎర్రజెండానై ఎగురుతానని దళిత విప్లవానికి పిలుపునందించారు అనామధేయుడు.

కవిత్వంలో మునుముంచుకొస్తున్న దళితవాదాన్ని దారి మళ్ళించాలని చూస్తున్న బ్రాహ్మణ దళితులను, దళిత బ్రాహ్మణులను చదివిన తరువాత, దళిత కవిత్వం ఇకపై ఉండదని భావిస్తున్న వారందరికి భవిష్యత్ అంతా దళితులదేనని భావించిన వారికి కె.రంగారావు 'రేపునాది' అనే కవితలో 'నా అక్షరాల కొచ్చిన స్వేచ్ఛను నీవాపలేవు' అని ముసుగు వేసుకున్న సమాజాన్ని, నటిస్తున్న అగ్రవర్ణాల వారినీ, స్వార్థచింతన గల మానవ లోకాన్ని విమర్శించారు. 'రెండేళ్ళ తర్వాత'

1. చిత్తరువు, దళిత కవితా సంకలనం, 1997, పుట 126.
2.. చిత్తరువు, దళిత కవితా సంకలనం, 1997, పుట 128.



కవిత రెండేళ్ళ తర్వాత దళిత ఉద్యమమే వుండదని పగటి కలలు కంటున్న మాజీ కవులకు దృష్టిలో పెట్టుకుని రాంరెడ్డి రచించారు.

"భవిష్యత్ భారత జాతి చైతన్యం,
కులమా! నీ పాడెకు కట్టిన మరణ శాసనం"[1] – కులం : ధనం

నేటి దుస్థితికి ఒక కారణం వర్ణ వ్యవస్థ అని అంటున్నారు కొలకలూరి ఇనాక్. కులం స్వదేశ వారసత్వ బలమయితే ధనం విదేశ దృష్టి ప్రభావ బలం. ఎక్కడ చూసినా ఈ బరువుతో కుంగుతున్న జనాలే సమాజంలో నిండి ఉన్నారు.

"భవిష్యత్ భారత జాతి చైతన్యం,
కులమా! నీ పాడెకు కట్టిన మరణ శాసనం" – మరణ శాసనం

కులం, ధనం బాధ సమాజంలో తొలగిపోతే భవిష్యత్ భారతజాతి చైతన్యం కలుగు తుందని వచ్చేతరం నుదుళ్ళలో ఉదయించే సూర్యుడు మారణాయుధం అవుతుందని ఆ రోజుకు, ఆ జాతికి అంబేద్కర్ ప్రబోధించిన సిద్ధాంతాల చైతన్యానికి స్వాగతం పలికారు ఇనాక్.

"బుద్ధిని బోధిస్తాను
ఈ దేశాన్ని యుద్ధభూమిని చేసి
ప్రపంచాన్నే జయిస్తాను"[2] – ప్రపంచాన్నే జయిస్తాను

జి.ఆర్. కుర్మే సాయుధపోరాటంలో ప్రపంచాన్ని జయిస్తానంటారు.

కత్తుల కిషోర్ 'నాకేం కావాలిప్పుడు'లో అనుభవాల్ని వివరించలేక ఏ

1. కులం : ధనం కవితా సంకలనం, కొలకలూరి ఇనాక్, జ్యోతి గ్రంథమాల, అనంతపురం, 1984, పుట 104.
2. పదునెక్కిన పాట, సం. జి. లక్ష్మీనరసయ్య, దళిత సాన ప్రచురణలు, విజయవాడ, 1996, పుట178, 197.

అనుభూతులకీ నోచుకోలేక నేం ప్లేట్ నగ్నంగానే ఉందంటారు. కులమతాలు లేని సమాజం, మనిషిగా గుర్తించే సమాజం, మానవ ప్రపంచం కావాలంటారు.

"నా కిప్పుడే రాయితీలూ వద్దు, కులమతాల్ని రద్దు చేసే రాజ్యాంగం కావాలి... నాకీ కులం వద్దు మతం వద్దు కులం గోడలు కూల్చిన మతం దాడులు దాటిన మనిషి కావాలి చూపగలవా? చూడగలనా? ఇప్పుడీ భూమ్మీద నగ్నాతి నగ్నమైన నిజమొకటి చెప్పాలి! ప్రశ్నించడాన్ని సహించగల వాడెవ్వడు... నా కిప్పుడేమీ వద్దు నన్ను మనిషిగ చూసే సమూహం కావాలి దేశమంటే మనుషులేనని నిరూపించగల కొత్త రాజ్యం కావాలి. రాజ్యాంగం కావాలి. మట్టి బతుకులోంచి మొలకెత్తే మానవ ప్రపంచం కావాలి"[1] – నాకేం కావాలిప్పుడు

"నల్ల తోటలో రెండు కొమ్మల్ని అంటు గడదాం
ఇది రెండు రుతువులు కలిసిన పొద్దు
ఇప్పుడు రెండు రుతువులకు ఒకే పేరు"[2] – మాదిలా

ఎండ్లూరి సుధాకర్ 'మాదిలా' కవితలో మాల మాదిగలను విడదీసే ప్రయత్నాలు చేసే వారినుండి తొలగిపోయి తేటపడుతున్న కొత్త చూపుతో మనస్పర్థలు లేకుండా తొలకరివేళ పలకరించుకుందాం అని మాల మాదిగలు కలసి మాదిలా పేరుతో ఒక్కటై పోవచ్చునని సూచిస్తున్నారు.

"హరిశ్చంద్రుడ్ని కొనగలిగిన వీరబాహుడి పూర్వ వైభవం మళ్ళీ మనక్కావాలి
ఈ కాలానికి ఇరవై ఒకటో ముందుమాట మట్టి బలపం తోనే రాయాలి"[3]
– మిగతా వేళ్ళకు చిటికెన వేలు వ్రాయునది.

---

1. పదునెక్కిన పాట, సం. జి. లక్ష్మీనరసయ్య, దళిత సాన ప్రచురణలు, విజయవాడ, 1996, పుట178, 197.
2. పదునెక్కిన పాట, సం. జి. లక్ష్మీనరసయ్య, దళిత సాన ప్రచురణలు, విజయవాడ, 1996, పుట 242, 209.



అంటారు పైడి తెరేష్‌బాబు. వేళ్ళు వెక్కిరింతల కోసం కాదు. కొత్తింటి పునాదికి గునపం ఎత్తే చెయ్యిలా వ్యత్యాసాలు లేకుండా ఉండాలంటారు.

'యుగాల భవిష్యత్తును పూరించుకుందాం ఎప్పటికీ మీరు మా వాళ్ళు కాదు'[1] అంటారు ఎం. వెంకట్ (బ్యాలట్ బాండ్).

'కొత్త వాచకంతో కొత్త కాలమే సమాధానం చెబుతుంది' అని ఆశిస్తున్నారు ఎండ్లూరి సుధాకర్. భవిష్యత్ సోదరతా చైతన్యాన్ని ఆశిస్తూ కొలకలూరి ఇనాక్ 'హింసిత వీలునామా'లో వర్గీకరణం శత్రుత్వం కాదు. అది సోదరుల్ని బలపరిచి ఏకం చేస్తుందని అవర్ణులను సవర్ణులు హింసించారు. అంతర్వర్గీకరణ వద్దని ఏకీకరణ కావాలని కోరుకోవటం కూడ ఏకీకరణ హింస అని వర్ణించారు.

"భూతకాలం గొంతు మీద కాలుపెట్టి
భవిష్యత్తు గుండెల్లో నిర్దయంగా
సంతకం చేస్తున్నాను"[2]

అని ఎండ్లూరి సుధాకర్ తన పాదాలు అగ్ని పాదాలని 'పాదముద్రలు' కవితలో వర్ణించారు.

"అంబేద్కరు దేర్పరచిన రాజ్యాంగం
ఎంతో కన్నీటిని సవరణలుగా దాచుకొంది
న్యాయమైన కాంక్ష
గ్రహణం పట్టిన సూర్యతేజం కావచ్చు

---

1. పదునెక్కిన పాట, సం. జి. లక్ష్మీనరసయ్య, దళిత సాన ప్రచురణలు, విజయవాడ, 1996, పుట 247.
2. కనకయ్య, దళిత రిసెర్చ్ సెంటర్, సికింద్రాబాద్, 2005, పుట 4, 22.

అది సవరణలో
గ్రహణాన్ని విదుల్చుకొంటుంది
రాబోయే రేపు
గ్రహణం విదుల్చుకున్న
సూర్యతేజపు కాంతులది"[1]

గ్రహణం విదుల్చుకొంటున్న సూర్యతేజం వర్గీకరణ పండుగ దగ్గర్లోనే ఉందని, నేటి శబ్దంలేని పోరాటం రేపు బాంబై పేలుతుందని, 'రేపటి దళిత రాజ్యానికి చెప్పుల దండనే జాతీయ జెండ'[2] అని, రచయితలు హక్కులకోసం పోరాటాన్ని ప్రకటించారు. అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించినందుకు చెప్పుల దండనే జాతీయ జెండగా నిలుస్తుందని సంఘటనకు తీవ్రంగా స్పందించారు.

అరాచకత్వం ప్రబలిపోతుందని నిన్నటి చిన్న రౌడీ బ్లేడు నేడు ఎమ్మెల్లే చాకై రేపు మంత్రి గండ్రగొడ్డలవుతుందని ఇవి సమాజాన్ని అణగదొక్కే అనైతికతకు రూపమని హెచ్చరిస్తున్నారు.

ఇది వరకు    సమాజ శరీరమ్మీద చీరుకుపోయే
చిన్న రౌడీ బ్లేడు
ఇవాళ    ఇంటింటికి చేతులు జోడించి
ఎన్నికల్లో మెరిసిన ఎమ్మెల్లే "చాకు"
రేపు    అరాచకీయాల్లో ఆరి తేరి
కాగల మంత్రి "గండ్రగొడ్డలి" [3]

మేఘాలనుండి ప్రతినీటి బిందువుని హిందూమహాసముద్రం తనలో కలుపుకుంటుంది. భారతదేశంలో పుట్టిన ప్రతివాడు భారతీయుడే. అందరిలో నేనూ ఒకడినే అని పరిచయం చేసుకుంటున్న తరుణంలో తన అస్తిత్వాన్ని

1. దండోరా దరువు, దళిత కవితా సంకలనం, సంపాదకులు డా. గుండె డప్పు
2. ఫత్వా, ఖాజా, కళాంజలి పబ్లికేషన్స్, పాల్వంచ, 1998, పుట 35.
3. మరణం నా చివరి చరణం కాదు, అలిశెట్టి ప్రభాకర్, విప్లవ రచయితల సంఘం, జంటనగరాలు, హైదరాబాదు, 1994.



నిరూపించుకుంటున్న సమయంలో అగ్ర వర్ణాలు (వర్ణ గొలుసులతో కట్టి) తమను అణగదొక్కుతున్నారు. తమ ధాటికి ఇక అభ్యున్నతికి ఎదురు నిలిచే తిమింగిలాల వంటివారు తాము చేసుకున్న వలలో తామే చిక్కి తమకు భోజ్యమవుతారని భావిస్తున్నారు.

"ఆకలి ఎండలు ముంచుకొచ్చి
మహాసంద్రం ఎండు ముఖం పట్టింది
'వర్ణ' గొలుసులతో కట్టి
అట్టడుగున తొక్కి
పాతాళంలో ముంచి పెట్టిన
బాధితులొక్కొక్కరే
ఇనుప వలను
కొత్త పొద్దును సూత్తాంటే" [1]    – వరికిళ్ళు

దళిత కవులు గత చరిత్ర పునాదులను విస్మరించలేదు. గత చరిత్రను సంపూర్ణంగా ఖండించారు. వర్తమానికి ప్రాధాన్యమిచ్చి భవిష్య నిర్మాణానికి ఉద్యమించారు. అణచివేతకు, శ్రమ దోపిడికి గుర్రై వెలుగుబాటకై గళమెత్తి సాయుధమే ఆయుధమని దళిత స్త్రీలు దళిత స్త్రీవాదాన్ని, దళిత రచయితలు దళిత విప్లవ చైతన్యాన్ని కలిగించారు. 'కలలే కదా అందమైన భవితకు పునాదులు' అని నేనొక కొత్త దేశాన్ని స్వప్నిస్తున్నానని సాహిత్యాధికారం, రాజకీయాధికారం తమదేనని వాంఛించారు.

దళిత చైతన్యం జీవనంలో మార్పును, సమాజ దృక్పథంలో మార్పును ఆశించింది. ఈ ఉద్యమం మహోద్యమమై సమాజంలో మార్పును కలిగించింది. ఆశించిన ఆశయాల సాధనకు మహామహుల చేయూత, బహుకాల పోరాటం, తిరుగుబాటు అవసర మయ్యింది.

1. మాదిక్కేక, మాదిగ సాహిత్య వేదిక, గుండె డప్పు కనకయ్య, యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, 1998, పుట 22.